క్లుప్తంగా

అబుల్‌కలాం ఆజాద్‌కు నివాళి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు హబీబ్‌బాషా ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని సోమవారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎస్‌కే అల్లావుద్దీన్ మాట్లాడుతూ అబుల్‌కలాం అజాద్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. మైనార్టీ నాయకులు హనీఫ్, నజీర్‌బాషా, కరీముల్లా, షేక్ సమీర్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలీషాకుమార్‌కు సన్మానం



సీతారామపురం: మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులో మైనార్టీల సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామపురానికి చెందిన డాక్టర్ కలివెల ఎలీషాకుమార్‌ను కలెక్టర్ ఆనంద్ సత్కరించారు. జిల్లా ప్రధాన మంత్రి పదిహేను సూత్రాల అమలు కమిటీ సభ్యుడిగా ఎలీషా కనబర్చిన ప్రతిభను గుర్తించి అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని పాతూరు ఉర్దూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా జిల్లా ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషాను నెల్లూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్, నెల్లూరు మేయర్ స్రవంతి శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

సీసీరోడ్డుకు శంకుస్థాపన



ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు మస్తాన్‌వలి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డిపాలెంలో చోరీ

కావలి: పట్టణంలోని వడ్డిపాలెంలోని ఓ ఇంట్లో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు..వడ్డిపాలేనికి చెందిన గుంజి కోటేశ్వరి ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఉదయం ఆమె పిల్లలను స్కూల్‌లో వదిలి ఓ ఇంటికి పనికి వెళ్లింది. అనంతరం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని రూ.60వేలు నగదు, సవర బంగారు కమ్మలు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జ్వరంతో వృద్ధురాలి మృతి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు ఏసీఎస్సార్‌కాలనీకి చెందిన చాట్ల పెంచలమ్మ (70) జ్వరం, విరోచనాలతో సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాలనీలోని శివాలయం సమీపంలో రెండోవీధి ప్రాంతానికి చెందిన 8 మంది వరకు జ్వరాలు, విరోచనాలతో బాధపడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీరోడ్ల పనుల పరిశీలన

ఉదయగిరి: గన్నేపల్లి ఎస్సీ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ సోమవారం పరిశీలించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని , జనవరిలోగా పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

సోమశిల :అనంతసాగరం సమీపంలోని శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద సోమవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. బట్రెడ్డి నాగేంద్ర ఆధ్వర్యంలో అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్య స్వాముల విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు విశేషంగా పాల్గొని సామూహిక భజనలు చేశారు.అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

తుప్పే.. ఎవరిదీ తప్పే

రోడ్డు ప్రమాదాలు, ఇసుక, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, దొంగతనాలు..తదితర కేసులకు సంబంధించిన పోలీసులు స్వాధీనం చేసుకున్న వానహాలను స్టేషన్లకు తీసుకొస్తుంటారు. చిన్న చిన్న ప్రమాదాలకు సంబంధించి రాజీమార్గాల ద్వారా వాహనాలను యజమానులు తీసుకెళ్లిపోతుంటారు. మిగిలిన కేసులకు సంబంధించిన వాహనాలు ఆయా పోలీసు స్టేషన్లలో మగ్గిపోతున్నాయి. ఏళ్ల తరబడి కేసులు నడుస్తుండడంతో వాహనాలు తుప్పు పట్టి పోతున్నాయి. కొన్ని కేసులకు సంబంధించి ఆయా వాహనాల యజమానులకు కోర్టులు జరిమానా విధిస్తుంటాయి. జరిమానా కట్టేంత కూడా వాహనాలు ధరలు పలకవన్న కారణంగా యజమానులు వదిలేస్తున్నారు. కేసులు పరిష్కారం కానందున వాహనాలు అలా ఉండిపోతున్నాయి. – కావలి

- సీజ్ చేసిన వాహనాలతో నిండిన పోలీసు స్టేషన్లు
- తీసుకెళ్లేందుకు ముందుకురాని యజమానులు
- తుప్పు పడుతున్న వాహనాలు
- విడి భాగాలు మాయం
- వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం



కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో శిథిలమైన వాహనాలు



కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో వాహనాలను కప్పేసిన పిచ్చితీగలు

200కుపైగా వాహనాలు

కావలి నియోజకవర్గంలోని ఆరు పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు 200కుపైగా దర్శనమిస్తున్నాయి. కావలి రూరల్ స్టేషన్‌లో 145, కావలి వన్ టౌన్ స్టేషన్‌లో 26, కావలి టు టౌన్ స్టేషన్‌లో 32, బిట్రగుంట స్టేషన్‌లో 15, అల్లూరు స్టేషన్‌లో 12, దగదర్తి స్టేషన్‌లో 11కుపైగా వాహనాలు ఉన్నాయి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. ఏళ్లతరబడి ఉన్న చాలా వాహనాలు ఎందుకూ పనికిరాని స్థితిలోకి తుక్కుగా మారిపోయాయి. అందులో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు, జీపులు ఉన్నాయి. కేసుల్లో సీజ్ చేసిన వాహనాల్లో కొన్నింటిని విడిపించుకుంటారు. అలా సీజైన వాహనాల్లో మరి కొన్ని ఏళ్ల తరబడి కేసుల పరిష్కారమవని కారణంగా పోలీస్ స్టేషన్‌లోనే ఉండిపోతాయి. ఏళ్ల తరబడి అవి నిరుపయోగంగా ఉండడంతో రోడ్డుపై నడపటానికి వీలు కానీ విధంగా మారుతాయి. అవి స్క్రాప్‌కు తప్ప ఏ విధంగానూ పనికిరావు. కొన్ని సందర్భాల్లో కోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రజలు తమ వాహనాలను తీసుకోవడానికి రారు. ఇది ప్రమాదాలకు గురైన వాహనాలకు సంబంధించి ఎక్కువగా జరుగుతుంది. తమ బంధువులను కోల్పోయిన వ్యక్తులు వాహనాలను తిరిగి తీసుకోవడానికి ఇష్టపడరు.అందుకే యజమానులకు పోలీసులు గుర్తు చేసినప్పటికీ వాహనాలను తీసుకోవడానికి ఇష్టపడరు. ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తీసుకొచ్చిన వాహనాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అలా చేసిన వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా అమ్మేయాలి. ఇలా ఎక్కడా జరగడం లేదు. వాహనాలకు వేసిన జరిమానాలను కట్టి తీసుకెళ్లని వాహనాలనైనా గుర్తించి వేలం ద్వారా విక్రయిస్తే ప్రభుత్వానికైనా కొంత ఆదాయం వస్తుంది. కానీ ఆ దిశగా పోలీస్ శాఖ చర్యలు చేపట్టకపోవడంతో వందలాది వాహనాలు స్టేషన్ల ఆవరణలో తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి.

పాస్‌బుక్‌ల మంజూరుకు వినతి

చేజర్ల: తమ పొలాలకు సంబంధించి పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని పెరుమాళ్లపాడు, చేజర్ల, కోటితీర్థం, తదితర గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ మస్తానయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత కొద్దిరోజులుగా పాస్‌బుక్‌లో కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నామని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ వీలైనంత త్వరగా పాస్‌బుక్‌లను మంజూరు చేస్తామని తెలిపారు.

కాలువలో పడిన వ్యక్తిని కాపాడిన సీఐ



సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద దువ్వూరు కాలువలో సోమవారం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సంగం సీఐ వేమారెడ్డి గమనించి స్థానిక యువకుడి సాయంతో కాపాడాడు. అనంతరం తనకు సహకరించిన యువకుడిని సీఐ అభినందించారు. కాగా కాలువలో పడిన వ్యక్తిని కాపాడిన సీఐను పలువురు అభినందించారు.

అసంపూర్తిగా పేదల పక్కాగృహాలు



కావలి: పట్టణంలోని ముసునూరులో గత ప్రభుత్వ హయాంలో పేదలకు 7,577 పక్కాగృహాలను నిర్మించే పనులను ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే పనులు ఆగిపోయి నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. ఇళ్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయో..ఇళ్లలో లబ్ధిదారులు ఎప్పుడు చేరుతారో ఆ నిర్మాణ పనులను పర్యవేక్షించే హౌసింగ్ శాఖ అధికారులే చెప్పలేకపోతున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో బ్రిక్స్, సిమెంట్ పూత పనులు పటుత్వం కోల్పోతున్నాయి.మరోవైపు లేఅవుట్‌లో పిచ్చిచెట్లు, కంప చెట్లు పెరిగి రోడ్లు రూపురేఖలు కోల్పోతున్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు

ఉదయగిరి: ఉదయగిరిలోని ఉర్దూ నార్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పఠాన్ సంధానిబేగం రాష్ట్ర స్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును సోమవారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ షమీమ్ అవార్డును అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకున్న సంధానిబేగం

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 68వ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం 13 జిల్లాలకు చెందిన 39 జట్లు ఆయా విభాగాల్లో పోటీ పడ్డాయి. అండర్–17 బాలుర విభాగంలో చిత్తూరు జట్టుపై నెల్లూరు జట్టు 03–14 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అండర్–19 బాలికల విభాగంలో విశాఖ జట్టుపై నెల్లూరు జట్టు 06–10 గోల్స్ తేడాతో విజయం సాధించింది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో అండర్–19 బాలుర విభాగంలో గుంటూరు జట్టుపై కడప జట్టు 6–7, కృష్ణా జట్టుపై పశ్చిమగోదావరి 04–11, అనంతపురం జట్టుపై తూర్పుగోదావరి జట్టు 03–18, నెల్లూరు జట్టుపై విశాఖపట్నం జట్టు 07–08 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అండర్–17 బాలుర విభాగంలో ప్రకాశం జట్టుపై పశ్చిమగోదావరి జట్టు 03–16 , కడప జట్టుపై తూర్పుగోదావరి జట్టు, 06– 19, గుంటూరు జట్టుపై విశాఖపట్నం జట్టు 08–15 గోల్స్ తేడాతో విజయం సాధించాయి.



ఉత్సాహంగా పోటీపడుతున్న క్రీడాకారిణులు

రెడ్‌క్రాస్‌కు విశ్రాంత ఉపాధ్యాయుల విరాళం



దాతను సత్కరిస్తున్న కావలి ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి: పట్టణంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణ కోసం విశ్రాంత ఉపాధ్యాయులు యాలమూరి కొండారెడ్డి, అరుణభారతీదేవి రూ.1,26,000 నగదును విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కొండారెడ్డి మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారుల కోసం కావలి వంటి చిన్నపట్టణంలో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఆర్డీఓ వంశీకృష్ణ పిలుపు మేరకు స్పందించి తాము నగదును విరాళంగా అందజేసినట్లు తెలిపారు. అనంతరం దాతను ఆర్డీఓ వంశీకృష్ణ సత్కరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ తలసేమియా డే కేర్ సెంటర్‌ను దేశంలోనే ఆదర్శకేంద్రంగా తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకొచ్చి విరాళాలను అందజేసి బాధిత బాలల ప్రాణాలను కాపాడాలని కోరారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, తలసేమియా కేంద్రం కన్వీనర్ కే హరినారపరెడ్డి, రెడ్ క్రాస్ పరిపాలనాధికారి బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కన్నుమూత



రమణయ్య నాయుడు(ఫైల్)

కావలి: ఆంధ్రప్రదేశ్ కోఆపరేటీవ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ తాళ్లూరు రమణయ్యనాయుడు (83) సోమవారం సాయంత్రం మరణించారు. గత కొంత కాలంగా వృద్ధాప్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. దగదర్తి మండలానికి చెందిన తాళ్లూరు రమణయ్యనాయుడు పాతతరం రాజకీయ నాయకుడు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేశారు. కాగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న తాళ్లూరు రమణయ్యనాయుడు తన కుమారుడు తాళ్లూరు ప్రసాద్‌నాయుడును రాజకీయ అరంగేట్రం చేయించారు. ప్రసాద్‌నాయుడు వైఎస్సార్‌సీపీ దగదర్తి మండల కన్వీనర్‌గా సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారు. ఆయన దగదర్తి మండల ఎంపీపీగా, భార్య స్వరూప జెడ్పీటీసీగా కొనసాగుతున్నారు. రమణయ్యనాయుడు మరణంపై దగదర్తి ప్రజలు విచారం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగినంటూ టికెట్ లేకుండా ప్రయాణం

- పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

కావలి: ఆర్టీసీ ఉద్యోగిని అని చెప్పి టికెట్ లేకుండా బస్సులో ప్రయాణం చేయడంతో పాటు డ్రైవర్ వాగ్వాదానికి దిగిన ఓ వ్యక్తిని సోమవారం పోలీసులకు అప్పగించినట్లు కావలి ఆర్టీసీ ఉద్యోగులు తెలిపారు. వివరాలు..విజయవాడ నుంచి కుప్పం వెళ్తున్న కుప్పం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఒంగోలులో ఓ వ్యక్తి ఎక్కాడు. తాను ఆర్టీసీ ఉద్యోగిని అని చెప్పి టికెట్ తీసుకోలేదు. మార్గం మధ్యలో సదరు ప్రయాణికుడిని బస్సు డ్రైవర్ గుర్తింపు కార్డు చూపించమని అడగగా ఇచ్చాడు. దాన్ని పరిశీలించగా ఆర్టీసీ జారీ చేసిన గుర్తింపు కార్డులా లేదు. దీంతో అనుమానంతో ఆధార్‌ను పరిశీలించగా సదరు వ్యక్తి పేరు తేడాగా ఉంది. దీంతో డ్రైవర్ సదరు వ్యక్తిని గట్టిగా నిలదీయగా వాగ్వాదానికి దిగి వేగంగా నడుస్తున్న బస్సు స్టీరింగ్‌ను పట్టుకుని అటు ఇటు తిప్పే ప్రయత్నం చేశాడు. దీంతో డ్రైవర్ తరువాత స్టాప్ కావలి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోగానే స్థానిక ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన విషయం చెప్పాడు. వారు పోలీసులకు తెలియజేయగా సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ముమ్మరంగా కుటుంబ సర్వే

వరికుంటపాడు : గువ్వాడిలో సచివాలయ సిబ్బంది కుటుంబ సర్వేను సోమవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రామాయణం శివకుమార్, వీపీఏ మిట్టా ఆదిత్య, ఏఎన్‌ఎం ఆదోని సురేఖ ఇంటింటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: మండలంలోని కాలువకట్ట గ్రామానికి చెందిన నావూరు ప్రభుదాస్, అల్లూరుపేటసత్రానికి చెందిన కుమ్మర గుంట శోభ సోమవారం మరణించారు. వారి అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి రూ.3వేలు చొప్పున అందజేశారు. అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు.

నేడు అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

వింజమూరు(ఉదయగిరి)/ఆత్మకూరురూరల్: వింజమూరు, ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓలు శ్రీనివాసరెడ్డి , ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు.

వరికుంటపాడు: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులు, అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ వేణుగోపాల్‌రావు సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులను రెండు బ్యాచ్‌లుగా విభజించి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం, స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సిద్దేశ్వరంలో వైద్యశిబిరం

సీతారామపురం : ఘటిక సిద్దేశ్వరంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చిన 75 మంది భక్తులకు సీతారామపురం పీహెచ్‌సీ డాక్టర్ స్వప్నారెడ్డి బీపీ,షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సిద్దేశ్వరం క్షేత్రాన్ని దర్శించుకున్న సీఐ

కార్తీక సోమవారం సందర్భంగా సిద్దేశ్వరం క్షేత్రాన్ని ఉదయగిరి సీఐ వెంకట్రావు దర్శించుకున్నారు. సీఐను దేవమ్మచెరువు పంచాయతీ ఉపసర్పంచ్ లకిడి బ్రహ్మయ్య సన్మానించారు.

ఉత్తరకాలువలో జారిపడి రైతు మృతి

సోమశిల: ఉత్తరకాలువలో జారిపడిపోయి రైతు మృతి చెందిన ఘటన అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలీ (53) తన సోదరుడితో కలిసి ఉత్తర కాలువ వద్దకు మోటార్‌కు మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మస్తాన్‌వలీ ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయారు. సోదరుడు కాలువలో దిగి ఎంత వెతికినా కనిపించలేదు. గ్రామస్తులకు సమాచారం అందజేయగా గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కలిగిరి: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ జలీల్‌బాషా హెచ్చరించారు. కలిగిరిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యాన్ని అక్రమంగా, కల్తీ చేసి విక్రయాలు చేసిన చర్యలు తప్పవన్నారు. తొలివిడత పట్టుబడితే రూ.5 లక్షల జరిమానా, రెండో విడత పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కలిగిరి, వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు మండలాల పరిధిలో నెల రోజుల వ్యవధిలో 8 బెల్టు దుకాణాలపై దాడులు జరిపి 8 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 110 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తుంటే 94409 02523 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పీఆర్ ఏఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉదయగిరి: ఉదయగిరి పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసరాజుపై మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలో గ్రామ పంచాయతీ నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సహకరించకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని విన్నవించారు. గండిపాళెం పంచాయతీలోని ఎస్సీ కాలనీలో వరద కాలువకు అడ్డుకట్ట, వంతెన నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేసి మూడు నెలలు గడిచినా ఎస్టిమేషన్ వేసి పనులు చేయించలేదని ఆరోపించారు. కార్యాలయంలోనూ, ఫోన్‌లోనూ అందుబాటులో ఉండటం లేదని, అతని వ్యవహారశైలితో మండలంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ ఆనంద్ ఏఈపై విచారణకు ఆదేశించినట్లుగా గండిపాళెం మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య తెలిపారు.

రక్తహీనతను అధిగమించాలి

కావలి : పట్టణంలోని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులు, బాలింతలకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ఐరన్, కాల్షియం సిరప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కమ్యూ ఆర్గనైజర్ ప్రసాద్, హెల్త్ సూపరవైజర్ సుగుణమ్మ, హెడ్‌నర్స్ ప్రవీణ్, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఇతర విధులు కేటాయించొద్దని ఏఎన్‌ఎంల వినతి

జలదంకి: తమకు ఇతర శాఖల విధులను కేటాయించొద్దని సచివాలయ ఏఎన్‌ఎంలు కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి ఎంపీడీఓ బ్రహ్మయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల్లో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తాము జాబ్ చార్టును అనుసరించి గ్రామాల్లో మాతా శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణ, వ్యాధి నిరోధక టీకాలు, పాఠశాల ఆరోగ్య కార్యక్రమాలు, డ్రైడే, రోజువారీ ఇంటింటి సర్వేలు, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, తదితర విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ పనులతోనే సతమతమవుతున్న తమకు ఇతర శాఖలకు సంబంధించిన సర్వేలు, విధులను కేటాయించడంతో ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. ఇతర శాఖల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం రైతుల ఆందోళన

- ఏడాది క్రితం నగదు వసూలు
- నెలలు గడుస్తున్నా స్పందించని అధికారులు

అనుమసముద్రంపేట: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తామన్నారు. నగదు వసూలు చేశారు. ఆ తరువాత చేతులెత్తేశారు. ఏడాది గడుస్తున్నా విద్యుత్ అధికారులు స్పందించకపోవడంపై కుప్పూరుపాడు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన 49 మంది రైతులు గతేడాది వ్యవసాయ కనెక్షన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అప్పటి విద్యుత్ శాఖ ఏఈ నిరంజన్‌ను సంప్రదించారు. ఆయన ఒక్కో కనెక్షన్ కోసం రూ.16వేలు వంతున రూ.7.84 లక్షలను వసూలు చేసినట్లు రైతులు తెలిపారు. ఆ తరువాత రేపు,మాపు అని చెబుతూ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. ఇటీవల మరోమారు ఆయన్ని ప్రశ్నించగా మరో రూ.10వేల కడితే కనెక్షన్లు ఇస్తామని చెబుతున్నాడని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మోటార్ల కింద దాదాపు 500 ఎకరాల ఆయకట్టు ఉందని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడం వల్ల గతేడాది సైతం పంటలు ఎండిపోయాయని వాపోయారు. ఈ ఏడాది సైతం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోతే పూర్తిస్థాయిలో పంటలు పండించేందుకు అవకాశం లేదని తెలిపారు. ఈ విషయమై ఏఈ నిరంజన్‌ను ప్రశ్నించగా ప్రస్తుతం ప్రభుత్వం నుంచి విద్యుత్‌కు సంబంధించిన వైర్లతో పాటు ఎటువంటి పరికరాలు ఇవ్వడం లేదని, అందువల్ల మరో ఆరు నెలలు వేచి ఉండాలని సమాధానమిస్తున్నారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో తాము రబీ సాగు ఎలా చేపట్టాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వారం రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం –డీఈఈ

కుప్పూరుపాడు రైతులకు వారం రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు అందజేస్తామని ఆత్మకూరు విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ఏఎస్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఏడాది నుంచి విద్యుత్ మెటీరియల్ కొరత ఉందని, అందువల్ల రైతులకు అనుకున్న సమయంలో కనెక్షన్లు అందివ్వలేకపోయామని తెలిపారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, కాంట్రాక్టర్లు సైతం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రైతులు సమస్యను అర్థం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

మర్రిపాడు : పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారులు సూచించారు. డీసీపల్లి మజారా ఖాన్‌సాహెబ్‌పేటలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పొగాకు రీజనల్ ఆఫీస్ ఏజీఓ తులసి,కేవీకే కందుకూరు శాస్త్రవేత్తలు ప్రసాద్ బాబు, వెంకటేశ్వర్లు, మర్రిపాడు వ్యవసాయాధికారి రామ్మోహన్, డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ పాల్గొని రైతులకు సూచనలు చేశారు.

తులసికోటతో చెత్తకు చెక్



పాతూరులోని ఓ వీధిలో ఏర్పాటు చేసిన తులసికోట

కావలి: పట్టణంలో వీధుల్లో పడేస్తున్న చెత్తను నివారించడానికి మున్సిపాలిటీ కమిషనర్ వినూత్న చర్యలు చేపడుతున్నారు. చెత్త పడేసే ప్రదేశాలను గుర్తించి అక్కడ తులసి కోటను ఏర్పాటు చేయిస్తున్నారు. పట్టణంలోని ఇంటింటికి వెళ్లి మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరిస్తున్నారు. అయినా కొందరు పారిశుధ్య కార్మికులు ఇంటి వద్దకు వచ్చిన సమయంలో చెత్తను ఇవ్వడం లేదు. తమకు తోచిన సమయంలో చెత్తను తీసుకెళ్లి వీధుల్లో పడేస్తున్నారు. దీంతో పారిశుధ్యం లోపిస్తుండడంతో మిగిలిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఫిర్యాదులు చేయడం సహజమైపోయింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ వినూత్నంగా ఆలోచించి వీధుల్లో చెత్త పడేసే ప్రదేశాలను గుర్తించి తులసి కోటను ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో వీధుల్లో చెత్త వేయడం తగ్గింది.